

# రోస్ట్...రోస్ట్

మహోత్సాహంతో బేగంపేట ఏర్‌పోర్టులో విమానం దిగేం, నేనూ, మా మూర్తీ!

వాడూ, నేనూ ఒకప్పుడు క్లాస్‌మేట్స్‌మన్న మాటే గానీ, నిజానికిద్దరం ఉత్తర-దక్షిణ ధృవాలం.

వాడికి పిత్రార్జితం, దానితోపాటు ఆ తర్వాత ఇంకేదో అనుకోకుండా కలిసొచ్చిన వారసత్వార్జితంగా పొలాలు బాగానే ముట్టాయి. స్కూల్లో వాలీబాల్‌ని కొట్టటంలోనూ, ఫుట్‌బాల్‌ని తన్నటంలోనూ ఒకప్పుడు చూపిన జోరునే, ఉత్సాహాన్నే ఆ పొలాల మీదా చూపించి, ఏవేవో ఎక్స్‌పెరిమెంట్లు చేసేడు. 'సాహసం శాయరా ఢింభకా' అనే డైలాగునే పదేపదే మననం చేసుకుంటూ ఎవరూ సాహసించని పంటలు ఏవేవో వేశాడు. పదేళ్లలో ఉన్న పొలాన్ని రెట్టింపు చేయలేదుగానీ, మొత్తంమీద అదనంగా ఇరుగు, పొరుగు పొలాలు కొన్ని కొని కలిపేసుకున్నాడు. ఇల్లు పట్నవాసానికేం తీసిపోకుండా మోడర్న్‌గా మార్చేసి, కారొకటి కొనేశాడు.

వాలీబాల్ ఉత్సాహం, ఫుట్‌బాల్ జోరూ ఉందన్నాక, ఆ ఉన్నవాడు అలాఅలా తృప్తిపడి ఆగిపోలేడుగదా.

ఓ సుముహూర్తాన మద్రాసెళ్లి గప్‌చిప్‌గా ఓ సిన్మా తీసేసేడు.

నేనేమో, చదువవగానే ఏ ఉద్యోగంలో దూరానో, అందులోనే భద్రంగా స్థిరపడిపోయేను. ప్రభుత్వోద్యోగానికి ఎలాంటి ఢోకా రానివ్వని "ఉత్తమ రచనలు" మాత్రమే చేస్తూ పిల్లాపీచుతో సుఖంగా ఉన్నాను.

అందువలన, మావాడు మద్రాసెళ్లిన మర్నాడే నాకు ఆఫీసుకు ఫోను కొట్టి "కథా, గట్రా విషయాల్లో తోడుందువుగాని ఓ ఆర్నెల్లు సెలవుపెట్టి రారాదూ" అన్నా...

నామీదా, నా ఉద్యోగ భద్రతమీదా నమ్మకం ఉన్న నేను "బాబోయ్, నావల్లకాదు, నాకాఫీల్డ్‌లో ఆసక్తి లేదు" అనేసి బుద్ధిగా ఇంటికెళ్లి, పెంద్రాళే భోంచేసి నిద్రోయాను.

సినిమా కథంటే మాటలా! అదో బ్రహ్మపదార్థం అని నా నమ్మకం.

చదువుకునే రోజుల్లోనే మా మూర్తి బంధువొకాయన, నాలుగు సిన్మాలు తీసిన ఘనుడు, అయిదో సిన్మా కథ వినిపించి "ఎలా ఉందీ?" అనడిగేడు మా నలుగుర్నీ. "సిన్మాలు చూసేది మీ కుర్రకారేగదా! చెప్పండయ్యా కథ ఎలా ఉందో!" అనడిగి ఏవేవో తినిపించేడు.

మూర్తితోసహా మిగిలిన ముగ్గురూ "బ్రహ్మాండం" అనేశారు.

"ఏమిటి... బాగుంది? కథా...? లేక కాఫీ టిఫెన్లా...? " అనబోయి, మర్యాద కాదని నోర్మూసుకున్నాన్నేను. పొగడ్తలు పూర్తయ్యాక, నా అనుమానం బయటపెట్టేను. "సార్!... కథయితే బాగానే ఉందిగానీ, ఇలాంటి కథతోనే ఇదివర్లో ఒకటీ, అరా సిన్మాలు వచ్చినట్లు న్నాయే...? " అని.

ప్రొడ్యూసరుగారు సందేహంగా ప్రక్కనే కూర్చున్న డైరెక్టరుగారికేసి చూసేరు. ఆ కథ ఆయనే వండేరుట.

"నిజమేన్నాయనా! కానీ, సిన్మాకథ లెప్పుడూ ఒకేలా యుండును. వాటిని సిన్మాగా తీయు టలోనే వైవిధ్యంబొచ్చును" అని సెలవిచ్చేరా డైరెక్టరుగారు.

"ఔనౌను!... మాంఛి కత అంటూ ఉంటే దాన్నోసారి ఫ్రై చేస్తాం,... మరోసారి పులుసొం డుతాం,... ఇంకోసారి రోస్టు చేస్తాం. ప్రేక్షకుల నాడి తెలిసి ఒక్కోసారి ఒక్కో రకంగా వండుతాం. రోజూ రెండు పూటలా బియ్యపు అన్నమే తింటున్నా మనం భోజనం మానేస్తు న్నామా...? ఇదీ అంతే..." అన్నారాయన.

"ఓహో...? " అనుకున్నాన్నేను, సినీ కతా జ్ఞానోదయమయిపోయి. అయినా అంతటివాళ్ళు చెప్తుంటే ఎలా కాదనగలం! ఆఫ్టాల్ నేను ఏడాదికో "చంద్రావు - చంచ్‌లక్ష్మి" కథలు రాసు కునే అనామకుణ్ణిగదా! నాకేం తెల్సు! అని ఊరుకున్నాను.

అయితే ఓ డౌటొచ్చింది. ఎంత మాంఛి కతనయినా ఓసారి ఫ్రై చేస్తారు, రెండోసారి పులు పొండుతారు, మూడోసారి రోస్టు చేస్తారు. మరి నాలుగోసారి...? ఖర్మగాలి అది ఆ క్రమంలో బొగ్గో, బూడిదో అయితే...? అని!

కాని, ఆ మాట పైకి అన్లేదు నేను.

ఇదుగో, ఇంత అనుభవం ఉంది గనుకనే మా మూర్తి మొదటిసారి మద్రాసెళ్ళగానే ఓ నాలుగు నెలలు ఫీల్డుని సర్వే చేసేడు. మరో నాలుగు నెలల్లో ఫిల్ము పీకి దేశం మీదికి వది లేసేడు. అదృష్టవశాత్తూ అది బాగా పోయింది. పైగా పొదుపుగా తీసేశాడు కూడానూ! ఆ ధైర్యంతో రెండోది మరింత తెలివిగా ప్లాను చేసి తీసేడు లేదా తీయించేడు. ఈసారది హిట్ట య్యింది.

దాంతో మావాడికి ధైర్యం వచ్చేసింది.

చెప్పాను గదండీ, మావాడు కాలేజీలో వాలీబాలూ, ఫుట్‌బాలూ జోరుగా ఆడిన రకం అనీ, అలాగే పొలాల్లో ఎక్స్‌పెరిమెంట్లు చేసి లాభాలు తీసిన రకం అనీనూ!

ఆ ధీమాతో, ఈ ధైర్యంతో మావాడు మూడో సిన్మా ఘనంగా తీసేడు. రెండు చేతులా ఖర్చుపెట్టేసేడు. అయితే మా చిన్నపుడా డైరెక్టరుగారు చెప్పిన ప్రకారం కథేగాక మొత్తం సిన్మా రోస్టు రోస్టయిపోయి తెగమాడిపోయింది. మావాడికి మొదటి రెండు సిన్మాల మీదా వచ్చిన లాభం గూబల్లోకి ఎగిరిపోయిందీ రోస్టుతో.

అయినా, మా మూర్తి ఆత్మవిశ్వాసం గొప్పది. ఏడుస్తూ కూచోకుండా హైదరాబాద్‌కు ఎగి రొచ్చేడు. నన్ను విమానం ఎక్కించి కలకత్తాలో దింపేడు.

"మనం ఓ డజను బెంగాలీ సిన్మాలు చూసి, మాంఛి కత ఉన్న సిన్మారైట్సు కొనేయబో తున్నాం. ఈసారి కథ అల్లేది నువ్వే. కాదనకు. క్రొత్త రక్తం కావాలి ఫీల్డుకు. నీకు కావా ల్సిన సలహాలిచ్చేందుకు డైరెక్టర్లూ, డైలాగు రైటర్లూ వగైరా బోల్డుమంది ఉన్నార్లే" అని నా నోరు మూసేశాడు, మావాడు.

"ఓహో! ఏమి, నాయదృష్టము! ఏ సత్యజిత్రాయ్ కతో, మృణాళ్ సేన్ కతో కొనేసి తెల్గూలో తీసేస్తాం అన్నమాట" ఆనందించేన్నేను.

"ఏడిసినట్లుంది. ఘనం సిన్మా తీసేది తెలుగులో, బెంగాలీలో కాదు. బెంగాలీ డిష్యుం, డిష్యుంలు ఎలా ఉంటాయో, ఏమాత్రం వెరైటీ ఉంటుందో చూద్దాం. డిష్యుం అంటే డిష్యుం అని కాదుగానీ, కాస్త సెంటిమెంటూ, కన్నీళ్ళూ, పాదధూళీ... గట్రా..." వివరించేడు మూర్తి.

"ఈమాత్రానికింత దూరం రావాలా! తెలుగులో మనకెన్ని దుమ్మూ ధూళీ కథలు లేవుగనుకా!" కోపగించుకున్నాన్నేను.

"నిజమేగానీ, కాస్త సక్సెస్ అయిన సిన్మాలైతే సేఫ్ అనీ..." నసిగేడు మూర్తి! "అలాంటివి మద్రాసులోనూ అరవంలో ఉన్నయ్యనుకో! కానీ, వాళ్లు మరీ కొండెక్కి కూచున్నారు, లక్షలడుగుతున్నారు. మలయాళీలవి చౌకేగానీ, వాళ్లు మరీ సైకాలజీ అన్చెప్పి గుడ్డలూడదీసి ఏదేదో పీకిపడేస్తున్నారు. తెలుగులో ఆ పప్పు ఉడకదు. ఇహ కన్నడ సిన్మాలంటావా! అవి మరీ మన తాతల్నాటి కథలు" వివరించేడు మూర్తి.

సరేనని ఓపిగ్గా మూర్తితోపాటు అక్షరాలా పన్నెండు సిన్మాలు చూసేను, ఓ వారం రోజుల్లో. పన్లోపనిగా కలకత్తా కూడా, సర్వే చేసేసేను.

అదృష్టవశాత్తూ మా మూర్తికి అన్నివిధాలా నచ్చిన సిన్మా ఒకటి దొరికింది. నాకేం తెలీదు గనుక, వాడి వాలకాన్ని చూసి "యస్... యస్... బ్రహ్మాండం... బాక్సాఫీస్ బద్దలవ్వచ్చు.." అనేసేను.

ఇంకేం అది కొనేసి, కాసెట్టూ అగ్రిమెంటూ గట్రా ఓ బ్రీఫ్‌కేసులో సర్దేసి విమానం ఎక్కేసేం. విజయోత్సాహంతో బేగంపేట ఏర్‌పోర్టులో దిగేం.

ఇంటికెళ్లి, స్నానం గట్రా చేసే సరికి మావాడి నుంచి ఫోనొచ్చింది. సాయంత్రం ఫలానా పేద్ధ ప్రొడ్యూసరుగారి లేటెస్ట్ సిన్మా ప్రివ్యూ! తప్పక రావాలీ అని.

మా కలకత్తా ట్రిప్ గురించి కోతలు కోయడానికి మాంచిఛాన్స్ అనుకుంటూ ఓ అరగంటముందే వెళ్లాం. సిన్మా మొదలయ్యేలోగా వచ్చినవాళ్లలో సగంమందికి తెల్సిపోయింది. మా మూర్తి ఓ బెంగాలీ సూపర్‌హిట్ కత కొనేశాడని. అందరూ అసూయగా అభినందించేవాళ్లే.

హాల్లో లైటారిపోగానే అంతా నిశ్శబ్దం.

అరగంట తర్వాత మూర్తి పదేపదే నాకేసి చూట్టం గమనించేను. అవును, సిన్మా చాలా భారీగా ఉంది. బ్రహ్మాండంగానే పోయేట్లుంది!

మరో అరగంట తర్వాత పదేపదే నా చేయినొక్క సాగేడు మావాడు. ఆ తర్వాత గిల్లసాగేడు.

మరో అరగంట తర్వాత మావాడో అరుపరచి నామీదికి వాలిపోయేడు.

సడెన్‌గా అసలు సంగతి అర్థం అయిపోయింది నాకు. అరరే! ఎవరీ కథ రాసిందీ! ఎవరీ సిన్మా డైరెక్ట్ చేసిందీ, ఔరా! ఎంత నేర్పూ, ఎంత తెలివీ!

'మేం అంతంత ఖర్చుపెట్టి కలకత్తా నుంచీ భద్రంగా బ్రీఫ్‌కేసులో మోసుకొచ్చిన వీడియోని మాకన్నా ముందే ఎంత అందంగా 'లా'కి ఏమాత్రం అందకుండా, దింపేసేరు వీళ్లూ! మనోళ్ళెంత గొప్ప మేధావులూ మన కతలెంత గొప్పవీ!

*("ఈనాడు" 27.5.1992)*

☆